సాక్షి
విశాఖపట్నం
శనివారం । 22 । మార్చి । 2025


సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే చట్టాలు అవసరం 8లో


సిటీలో సూపర్ జెయింట్స్ 8లో



కొంగ బావ..డక్‌డక్




పంట పొలాలకు అతిథులు వచ్చాయి. పచ్చని వరి పైరుల్లో తెల్లటి కొంగలు కనువిందు చేశాయి. పంట నీటిలో ఉన్న పురుగులను తింటూ కనిపించాయి. మరోవైపు కాపులుప్పాడలోని ఓ చెరువులో నీటి బాతులు, పొడుగు కాళ్ల కొంగలు సందడి చేశాయి.

-ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



చీకటి గంట మోగిద్దాం!



ఎర్త్ అవర్‌కు పిలుపునిచ్చిన వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ ఇండియా

నేటి రాత్రి 8.30 నుంచి గంట పాటు లైట్లు ఆర్పాలని పిలుపు

విశాఖ సర్కిల్ పరిధిలో ఆ గంట సేపట్లో 5 లక్షల యూనిట్ల విద్యుత్ ఆదా

వాతావరణ మార్పు జీవవైవిధ్యాన్ని కాపాడుకునేందుకు

ఏటా ప్రపంచ వ్యాప్తంగా 190 దేశాల్లో నిర్వహిస్తున్న డబ్ల్యూడబ్ల్యూఎఫ్

సాక్షి, విశాఖపట్నం: గ్లోబల్ వార్మింగ్ కారణంగా జీవవైవిధ్య ఉనికి ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో భూమిని పరిరక్షించేందుకు ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమమే ఎర్త్ అవర్. విద్యుత్ ఆదా చెయ్యడం అంటే.. పర్యావరణాన్ని కాపాడడమే. అందుకే ప్రతీ సంవత్సరం ఒక గంట కరెంటు సరఫరా ఆపేసి.. ఎర్త్ అవర్ నిర్వహిస్తున్నారు. శనివారం ప్రపంచ వ్యాప్తంగా ఈ కార్యక్రమం జరగనుంది. వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) అనే సంస్థ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విశాఖలోనూ ఈ బృహత్తర ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిస్తున్నారు.

భూమిపై ఉన్న ప్రేమ, వాతావరణాన్ని కాపాడటంలో బాధ్యతగా మొదలైన ఒక చిన్న కార్యక్రమమే.. కాలక్రమంలో పెద్ద ఉద్యమంగా మారింది. అదే ఎర్త్ అవర్. ప్రతి సంవత్సరం ఒక రోజున ఒక గంట పాటు నగరంలో మొత్తం విద్యుత్ వాడకాన్ని ఆపేసి ఈ ఎర్త్ అవర్‌ను పాటిస్తుంటారు. ఈసారి మార్చి 22న అంటే.. ఇవాళ రాత్రి సరిగ్గా 8.30 నుంచి 9:30 గంటల వరకు ఈ ఎర్త్ అవర్‌ను పాటించి.. పర్యావరణ పరిరక్షణకు మేము సైతం ముందుకు రావాలంటూ పర్యావరణ వేత్తలు పిలుపునిస్తున్నారు.

ఆ ఒక్క గంటలో 5 లక్షల యూనిట్లు ఆదా

భారత్ ఈ ఎర్త్ అవర్‌లో 2011 నుంచి పాలుపంచుకుంటోంది. ప్రతి ఏటా ఆయా నగరాలు, ప్రాంతాలు గంట పాటు చీకటిగంటని కొట్టి భవిష్యత్తు తరాలకు మంచి వాతావరణం అందించేందుకు నడుంబిగిస్తున్నాయి. విశాఖలోనూ ప్రతి ఇల్లూ ఈ ఎర్త్ అవర్ పాటిస్తే.. లక్షల యూనిట్ల విద్యుత్‌ను ఆదా చెయ్యవచ్చు. సాధారణంగా ఈపీడీసీఎల్ పరిధిలో విశాఖ సర్కిల్‌లో ప్రతి రోజూ 12 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోంది. అంటే.. గంట సేపు విద్యుత్ దీపాలు సర్కిల్ పరిధిలో ఆపేస్తే.. ఏకంగా 5 లక్షల యూనిట్లు ఆదా చెయ్యడంతో పాటు.. 0.82 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు కూడా నియంత్రించవచ్చు. ఈ ఉద్యమంలో పాల్గొనాలని ఈపీడీసీఎల్ అధికారులు సైతం పిలుపునిస్తున్నారు.

అసలు ఎందుకు లైట్లు ఆర్పాలంటే..?

వాతావరణ మార్పులపై అవగాహన కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఈ కార్యక్రమ అసలు లక్ష్యం. 2007లో ఆస్ట్రేలియాలోని సిడ్నీలో సింబాలిక్ లైట్స్ అవుట్ కార్యక్రమంగా ప్రారంభమైంది. అప్పటి నుంచి 190కి పైగా దేశాల్లో ఈ కార్యక్రమాన్ని పాటిస్తూ.. ప్రపంచ ఉద్యమంగా మారింది. ఈ క్రమంలోనే.. విశాఖపట్నంలోనూ కూడా ఈ కార్యక్రమాన్ని పాటిస్తున్నారు. వరల్డ్ వైడ్ ఫండ్ నేచర్ (డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పర్యావరణ ఉద్యమాన్ని ప్రతి సంవత్సరం మూడో శనివారం పాటిస్తుంటారు.

ప్రతి ఒక్కరూ ఎర్త్ అవర్ పాటించండి



పెరుగుతున్న పర్యావరణ సమస్యలు, రోజువారీ విద్యుత్ వినియోగం యొక్క ప్రభావం గురించి అవగాహన పెంచడం లక్ష్యంగా ఎర్త్ అవర్ అనే గ్లోబల్ గ్రాస్‌రూట్ ఉద్యమం నిర్వహిస్తున్నాం. వ్యక్తులు, సంస్థలు, కమ్యూనిటీలు.. భూ పరిరక్షణతో పాటు వ్యక్తిగత జీవనశైలిలో మార్పు వచ్చేలా ప్రోత్సహిస్తున్నాం. ఇందుకోసమే.. గంట సేపు అనవసరమైన లైట్లను ఆఫ్ చేయాలని పిలుపునిస్తున్నాం. కేవలం విశాఖ నగరంలోనే కాకుండా.. జిల్లా అంతటా పాటించాలని వైజాగ్ ప్రోగ్రాం అధికారి హనీసెలజ్ సహకారంతో అవగాహన కల్పించాం. ప్రతి ఒక్కరూ ఎర్త్ అవర్ పాటించాలని వేడుకుంటున్నాం.

– ఫరీదా టాంపల్,
డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్ ఇండియా స్టేట్ డైరెక్టర్

రూ.25 లక్షల విలువైన విద్యుత్ ఆదా



పర్యావరణ పరిరక్షణ కోసం సంవత్సరానికి ఒకసారి నిర్వహించే కార్యక్రమమే ఈ 'ఎర్త్ అవర్'. ఇందులో ప్రతి ఒక్క విద్యుత్ వినియోగదారుడూ భాగస్వామి కావాలి. భూగోళాన్ని పరిరక్షించేందుకు ప్రపంచ వ్యాప్తంగా చాలా నగరాల్లో ప్రధాన ప్రదేశాలలో ఒక గంట విద్యుత్తు స్వచ్ఛందం ఆపేస్తారు. అదేవిధంగా ఇళ్లల్లో విద్యుత్ ఉపకరణాలు ఆపివేయడం ద్వారా కర్బన ఉద్గారాలు తగ్గించవచ్చు. తద్వారా విద్యుత్తును ఆదా చేయాలి అనే ఆలోచన ప్రతి ఒక్కరిలో కలిగించే విధంగా ఉపయోగపడుతుంది. విద్యుత్తు ఆదా సమస్త జీవరాసులనీ కాపాడేందుకు, మన తరాన్నీ, భవిష్యత్తు తరాలను కాపాడేందుకు ఉపకరిస్తుంది. గంటపాటు విద్యుత్ ఆపితే సర్కిల్ పరిధిలో రూ.25 లక్షల విలువైన విద్యుత్‌ను ఆదా చెయ్యగలం.

– శ్యామ్‌బాబు, ఈపీడీసీఎల్ విశాఖసర్కిల్ ఎస్ఈ

'సాక్షి' కథనాలకు 'స్పందన' ఇదే..

ఆక్రమణదారుల తాట తీస్తోంది. ప్రజా సమస్యలపై గళమెత్తుతోంది. ప్రజల గొంతుకై నినదిస్తోంది. 'భూ'చోళ్ల భరతం పడుతోంది. సామాన్య ప్రజల అర్జీలపై ప్రభుత్వ యంత్రాంగాన్ని నిలదీస్తోంది. 'సాక్షి' తనదైన కథనాలతో అధికారులను పరుగులు పెట్టిస్తోంది.


ఆక్రమణదారులు వద్ద స్టేట్‌మెంట్ రికార్డు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది


ప్రభుత్వ భూమిలో షెడ్‌లు తొలగిస్తున్న సిబ్బంది

అక్రమ నిర్మాణాల కూల్చివేత



సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన కథనం

మధురవాడ: విశాఖ రూరల్ మండల కొమ్మాది వెంకట్‌నగర్‌లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మించిన షెడ్లను రెవెన్యూ అధికారులు తొలగించారు. కోర్టు వివాదంలో ఉండి రద్దు అయిన డి. పట్టా భూముల్లో ఏర్పాటు చేసిన కోళ్ల ఫారం, ఇతర షెడ్లను శుక్రవారం నేల మట్టం చేశారు. ఆక్రమణదారులతో రెవెన్యూలోని కొందరు దిగువ స్థాయి అధికారులు లాలూచీ పడడంతో కబ్జాల పర్వం కొనసాగుతోంది. ఈ క్రమంలో సుమారు రు.40 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమికి రెక్కలొచ్చాయి. ఈ అక్రమ వ్యవహారంపై సాక్షి దినపత్రికలో 'రూ.40కోట్లు సర్కారు భూమికి రెక్కలు' అనే శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. విధిలేని పరిస్థితిలో ఆక్రమణదారులతో లాలూచీ పడిన రెవెన్యూ అధికారులు పరుగులు తీశారు. కొమ్మాది సర్వే నంబరు. 157/1లో 3.9 ఎకరాల భూమిలో షెడ్‌లు, ఇతర నిర్మాణాలను ఆర్ఐ అనిల్ కిషోర్ ఆధ్వర్యంలో పలువురు వీఆర్‌వోలు, వీఆర్ఏలు ఇతర సిబ్బంది కూల్చివేశారు. ఆక్రమణదారులు నుంచి స్టేట్‌మెంట్‌లు రికార్డు చేశారు. దీనిపై తహసీల్దారు పాల్‌కిరణ్ స్పందిస్తూ ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. అయితే ఈ భూమి కోర్టు వివాదంలో ఉందని, కోర్టు ఆదేశాలకు భిన్నంగా నిర్మాణాలు చేస్తుండడంతో చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

బాధ్యులపై చర్యలు ఎక్కడ?

కోర్టు ఆదేశాలు ధిక్కరించి కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించేస్తున్న అక్రమార్కులపై, ఇంతటి విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోకుండా, అక్రమార్కులకు అండగా నిలుస్తున్న రెవెన్యూలోని దిగువ స్థాయి అధికారులు, సిబ్బందిపై చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

'పీజీఆర్‌ఎస్' వినతులపై నిర్లక్ష్యం వద్దు



18న సాక్షిలో ప్రచురితమైన కథనం

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో వచ్చిన వినతులపై జిల్లా యంత్రాంగం తీవ్రంగా స్పందించింది. ఈనెల 18న సాక్షి దిన పత్రికలో 'ప్రజా ప్రదక్షిణ'లే అన్న శీర్షికతో వార్త ప్రచురితమైన సంగతి విదితమే. దీనిపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ స్పందించారు. సాక్షి కథనంలో తమ అభిప్రాయాలను వెల్లడించిన వారి సమస్యలు తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిష్కరించడంలో ఎవరు అలసత్వం ప్రదర్శించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత విభాగాలు, పలు శాఖల అధికారులు ఫిర్యాదుల పరిష్కారంపై తక్షణం నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

న్యూస్‌రీల్

సరకు రవాణాలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే సరికొత్త రికార్డు

తాటిచెట్లపాలెం: సరకు రవాణాలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే సరికొత్త రికార్డును నెలకొల్పినట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. భారతీయ రైల్వేలోనే 2024–25సంవత్సరంలో 250మిలియన్ టన్నుల సరకును లోడింగ్ చేసి దేశంలోనే తొలి జోన్‌గా రికార్డు సృష్టించింది. దీంతో గతంలో ఉన్న అన్ని రికార్డు కనుమరుగైపోయినట్లు తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే వరుసగా రెండో ఏడాది కూడా 250 మిలియన్ టన్నుల మార్కును చేరుకుంది. ఈ రికార్డు సాధనలో జోన్ పరిధిలో గల వాల్తేర్, సంబల్‌పూర్, ఖుర్దారోడ్ మూడు డివిజన్‌ల పాత్ర ఎంతో ఉంది. ముఖ్యంగా ఈ పరిధిలో గల బొగ్గు గనులు, పారాదీప్, ధమర, విశాఖపట్నం, గంగవరం, గోపాల్‌పూర్ పోర్టులు, బైలడిల్లలో గల ఐరన్ ఓర్ గనుల, స్టీల్, అల్యూమినియం పరిశ్రమల వ్యాపారల ద్వారా ఈ రికార్డు సాధించగలిగింది.

స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పోస్టుకు ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) పోస్టుకు శుక్రవారం జరిగిన ఇంటర్వ్యూలో పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ సెలక్షన్ బోర్డు (పీఈఎస్‌బి) ఎవరినీ ఎంపిక చేయలేదు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత డైరెక్టర్ (ఫైనాన్స్) గణేష్ త్వరలో పదవీ విరమణ చేయనుండటంతో ఆ స్థానాన్ని భర్తీ చేయడానికి శుక్రవారం పీఈఎస్‌బీ ఆధ్వర్యంలో వర్చువల్‌గా ఇంటర్వ్యూ నిర్వహించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ నుంచి ఐదుగురు, హెచ్ఎల్, ఎన్టీపీసీ, ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్, ఐఓసీఎల్, భెల్ నుంచి ఒక్కొక్కరు చొప్పున మొత్తం 10 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అనంతరం వీరిలో ఎవ్వరినీ ఎంపిక చేయలేదని పీఈఎస్‌బీ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు.

ముస్లింలపై కూటమి కక్ష సాధింపు

- హజ్ యాత్రీకులకు గన్నవరం ఎయిర్‌పోర్టులో ఎంబార్కేషన్ పాయింట్ రద్దు చేయడం తగదు
- వైఎస్సార్ సీపీ నేతలు మహమ్మద్ ఇమ్రాన్, భర్కత్ అలీ, జహీర్ అహ్మద్


మాట్లాడుతున్న రాష్ట్ర హజ్ కమిటీ మాజీ సభ్యుడు మహమ్మద్ ఇమ్రాన్

సాక్షి, విశాఖపట్నం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ముస్లింలపై కక్ష సాధింపు చర్యలకు చంద్రబాబు పాల్పడుతున్నారని రాష్ట్ర హజ్ కమిటీ మాజీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ మహమ్మద్ ఇమ్రాన్, జిల్లా మైనార్టీ విభాగ అధ్యక్షుడు భర్కత్ అలీ, సీనియర్ నాయకులు డాక్టర్ జహీర్ అహ్మద్ మండిపడ్డారు. హజ్ యాత్రీకుల సౌలభ్యం కోసం విజయవాడలో గన్నవరం ఎయిర్‌పోర్టులో ఎంబార్కేషన్ పాయింట్లు రద్దు చేసిందని, ఇది రంజాన్ మాసంలో రాష్ట్రంలో ఉన్న ముస్లింలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన 'వెన్ను పోటు' తోఫా అని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.

ముస్లిల పక్షపాతి వైఎస్ జగన్ : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఏపీ నుంచి బయలుదేరే యాత్రికులకు గన్నవరం విమానాశ్రయం నుంచి వెళ్లేలా ఎంబార్కేషన్ పాయింట్ ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. గతంలో హజ్ యాత్రలో భాగంగా 2,873 యాత్రీకులకు వైఎస్ జగన్ ప్రభుత్వం రూ. 14.04 కోట్లు నిధులు కేటాయించడమే కాకుండా వివిధ ఎంబార్కేషన్ పాయింట్లు నుంచి బయలుదేరిన వారికి కూడా ఆర్థిక చేయుతనిచ్చిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎలాంటి సహాయం చేయకపోగా కనీసం గన్నవరం విమాశ్రయం నుంచి వెళ్లే వీలు లేకుండా చేయడం దారుణమన్నారు. కో–ఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, షేక్ బాబ్జి, అఫ్రోజ్ లతీష్, ముజీబ్ ఖాన్, ఎండీ నౌషాద్, ఎండీ ముక్బాల్ పాల్గొన్నారు.

కారాగారంలో విద్యా బోధన

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో రౌడీషీటర్లకు విద్యా బోధన చేస్తున్నట్లు జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సాయి ప్రవీణ్ శుక్రవారం తెలిపారు. డెకాయిట్, రోబరీ, హత్య కేసులు, ఘర్షణలు తదితర కేసులలో రౌడీషీట్ తెరవబడినవారిలో 74 మంది ప్రస్తుతం ఇక్కడ కేంద్ర కారాగారంలో ఉన్నట్లు తెలిపారు. వీరిపై కొందరిపై సుమారు 10 కేసులు వరకు ఉన్నట్లు తెలిపారు. వారికి కొద్ది రోజులుగా ప్రతి రోజు ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. జైల్‌లో సార్వత్రిక విద్య విధానం (ఓపెన్)లో పదో తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదవాలనే ఆసక్తి గల ఖైదీల కోసం ఇక్కడ అందుబాటులో ఉండే ఉపాధ్యాయుడు విద్యాబోధన చేస్తున్నారన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటలు నుంచి 11 గంటలు వరకు తరగతులునిర్వహిస్తున్నామన్నారు. పూర్తిగా చదువురాని వారికి బేసిక్ విద్య నేర్పుతున్నట్లు తెలిపారు. రౌడీషీటర్లలో మంచి మార్పు తీసుకురావడానికి ఈ విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం


మాట్లాడుతున్న నగర మేయర్, స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం సభ్యులు ఆమోదం తెలిపారని నగర మేయర్, జీవీఎంసీ స్థాయీ సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. శుక్రవారం స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. 104 అంశాలు పొందుపరచగా, ఒక అంశాన్ని వాయిదా వేశారు. 2 అంశాలను సభ్యులు తిరస్కరించారు. మిగిలిన 101 అంశాలు ఆమోదం తెలిపారు. వీటిలో ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగానికి చెందిన పలు అభివృద్ధి పనులు ఉన్నాయని వాటిని చర్చించిన పిదప సభ్యులు ఆమోదం తెలిపారన్నారు. సమావేశంలో కార్యదర్శి బీవీ రమణ, వ్యయ పరిశీలకుడు సి.వాసుదేవరెడ్డి, జోనల్ కమిషనర్లు ప్రేమ ప్రసన్నవాణి, శివప్రసాద్, మల్లయ్య నాయుడు, బి.రాము, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు చిరంజీవి, గంగాధరరావు, సుధాకర్, అప్పారావు, సహాయ వైద్యాధికారులు డాక్టర్ ఎస్ కిషోర్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ అప్పలనాయుడు, డాక్టర్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

విశాఖ అభివృద్ధిపై మంత్రి నారాయణ సమీక్ష


విశాఖ అభివృద్ధిపై జరిగిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

మహారాణిపేట: భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని విశాఖలో అభివృద్ధి చర్యలు చేపట్టాల్సి ఉందని, దానికి తగినట్లు అక్కడ అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అన్నారు. నగర అభివృద్ధి, మాస్టర్ ప్లాన్ అమలు, టీడీఆర్ బాండ్ల జారీ తదితర అంశాలపై శుక్రవారం అమరావతి రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన సమీక్షించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ విశాఖలో టీడీఆర్ బాండ్ల జారీలో మరింత వేగం పెంచాలని, చాలా వరకు పెండింగ్ ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, దీనిపై జీవీఎంసీ కమిషనర్ యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నెల రోజుల్లోగా పెండింగ్‌లో ఉన్న టీడీఆర్ బాండ్ల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని నిర్దేశించారు. మెట్రో, మెట్రో లైట్, మోడరన్ ఎలక్ట్రిక్ బస్ కారిడర్లపై ప్రధానంగా చర్చించారు.

మాస్టర్ ప్లాన్ మార్పులు, చేర్పులపై చర్చ

మాస్టర్ ప్లాన్‌లో మార్పులు, చేర్పులపై ఎమ్మెల్యేలతో మంత్రి చర్చించారు. గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై పునరాలోచన చేయాలని, తప్పకుండా మార్చాలని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. రోడ్ల విస్తరణ అవసరం ఎంత మేరకు ఉందో అంతవరకే ప్లాన్ అమలు చేయాలని, భూసేకరణ చేపట్టాలని ఎమ్మెల్యేలు సూచించారు. డబుల్ డెక్కర్ రోడ్లు, మెట్రో కారిడార్ నిర్మించేందుకు యోచిస్తున్నామని, అతి త్వరలోనే ముఖ్యమంత్రి సూచనల మేరకు కార్యాచరణ ప్రారంభిస్తామని మంత్రి చెప్పారు.

ఉపాధి హామీ పథకంపై సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ హరేందిర ప్రసాద్, అధికారులు

మహారాణిపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఈ పథకం పరిధిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు, ప్రాజెక్టులపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్షించారు. సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని.. జిల్లాలో చేపడుతున్న చర్యలు వివరించారు. జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కె.వి.వి. చౌదరి, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాసరావు, డీపీవో శ్రీనివాసరావు, డ్వామా అధికారులు పాల్గొన్నారు.


'యువర్ ప్లాట్‌ఫాం' మ్యాగజైన్ ప్రారంభం



మ్యాగజైన్ ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: వాల్తేరు డివిజన్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం 'యువర్ ప్లాట్‌ఫాం' అనే మంత్లీ మ్యాగజైన్‌ను డీఆర్‌ఎం లలిత్ బోరా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ రైల్వేలో యాక్షన్ మాడ్యూల్ విధానంలో ప్రారంభించిన మొట్టమొదటి మ్యాగజైన్ ఇదేనన్నారు. ఈ మ్యాగజైన్‌లో మొదటి ఐదు పేజీల్లో వాల్తేరు డివిజన్, భారతీయ రైల్వేకి సంబంధించిన సమాచారం, కథనాలు, ఇతర వివరాలు ఉంటాయని తెలిపారు. మిగిలిన పేజీల్లో పర్యాటక ప్రదేశాలు, ఆహారం, సైన్స్, ఆరోగ్య సూచనలు ఉంటాయని వివరించారు. ఈ మ్యాగజైన్‌ను త్వరలో విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ రైళ్లు, ఉదయ్ ఎక్స్‌ప్రెస్, అరకు విస్టాడోమ్ కోచ్‌లలో ప్రయాణికులకు ఉచితంగా అందిస్తారు. సీనియర్ డీసీఎం కె.సందీప్, మ్యాగజైన్ వ్యవస్థాపకుడు వి.ప్రవీణ్, ఎం.శంకర్, పి.ఎస్.కార్తీక్ పాల్గొన్నారు.

సూపర్ జెయింట్స్ వచ్చేశారు



విశాఖ స్పోర్ట్స్: ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో తమ తొలి మ్యాచ్ ఆడేందుకు లక్నో సూపర్ జెయింట్స్(ఎల్ఎస్‌జీ) జట్టు విశాఖపట్నం చేరుకుంది. శుక్రవారం ప్రత్యేక విమానంలో లక్నో నుంచి జట్టు విశాఖకు వచ్చింది. వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఈ నెల 24వ తేదీ రాత్రి 7.30 గంటలకు ఎల్ఎస్‌జీ, ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. గత సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన రిషబ్ పంత్ విశాఖ స్టేడియంలో రెండు మ్యాచ్‌లు ఆడాడు. ఈసారి ఎల్ఎస్‌జీ జట్టుకు రిషబ్ పంత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. తమ తొలి మ్యాచ్‌లో విజయం సాధించాలని ఇరు జట్లు ఉవ్విళ్లూరుతున్నాయి. ఇప్పటికే ఢిల్లీ క్యాపిటల్స్ ప్రాక్టీస్ ప్రారంభించగా, ఎల్ఎస్‌జీ జట్టు శనివారం ప్రాక్టీస్ చేయనుంది. ఎల్ఎస్‌జీ జట్టుకు మెంటర్‌గా జహీర్ ఖాన్, హెడ్ కోచ్‌గా లాంగర్, సహాయ కోచ్‌లుగా జాంటీ రోడ్స్, ప్రవీణ్ తంబే, లాన్స్ క్లుసెనర్ వంటి వారు ఉన్నారు. జట్టులో వికెట్ కీపర్లుగా ఆర్యన్, నికోలస్ అందుబాటులో ఉన్నారు. ఆల్‌రౌండర్లుగా మార్క్రమ్, మార్ష్, షాబాజ్ ఉండగా, బ్యాటింగ్‌లో ఆయుష్, డేవిడ్ మిల్లర్, సమద్ తమ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉన్నారు. బౌలింగ్‌లో రవి బిష్ణోయ్, ఆవేష్, ఆకాష్‌తో పాటు ఇంపాక్ట్ ప్లేయర్‌గా సిద్ధార్థ్ లేదా అర్షిన్ ఆడే అవకాశం ఉంది. అయితే మయాంక్, మోషిన్, ఆవేష్ గాయాల కారణంగా జట్టుకు అందుబాటులో ఉండటంపై సందేహాలు ఉన్నాయి. ప్రాక్టీస్ సెషన్ తర్వాత బౌలింగ్ విభాగంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇరు జట్లు గ్రూప్-2లో ఉన్నాయి. గత సీజన్‌లో ఇరు జట్లు కూడా లీగ్ దశలోనే నిష్క్రమించాయి.

రాహుల్ రానట్టేనా?

కాగా.. ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ఆటగాడు కె.ఎల్.రాహుల్ ఇంకా విశాఖ చేరుకోలేదు. దీంతో ఆయన విశాఖలో జరిగే రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండటం అనుమానమే.! దీంతో ఎల్ఎస్‌జీతో జరిగే తొలి మ్యాచ్‌లో ఢిల్లీ తరఫున ఫెరీరా వికెట్ కీపర్‌గా బరిలోకి దిగే అవకాశం ఉంది. గత సీజన్‌లో రాహుల్ లక్నో జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు.







విశాఖ ఉక్కు ఉద్యమం @ 1500

- 2021 నుంచి అలుపెరగని పోరాటం
- నేడు దీక్ష శిబిరం వద్ద మానవహారం

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఉద్యమం శనివారం నాటికి 1500 రోజులు పూర్తవుతుంది. స్టీల్‌ప్లాంట్‌ను నూరు శాతం వ్యూహాత్మక అమ్మకం చేయాలని 2021 జనవరి 27న కేంద్ర కేబినెట్ కమిటీ ఆన్ ఎకనమిక్ ఎఫైర్స్ కమిటీ నిర్ణయించింది. దీంతో ఉక్కు కార్మిక వర్గం భగ్గుమంది. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పటి నుంచి కార్మికులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఢిల్లీలో రెండు రోజులు ధర్నాలు చేశారు. జాతీయ రహదారిని పలుమార్లు దిగ్బంధించారు. స్టీల్‌ప్లాంట్ పరిపాలన భవనం ముట్టడి, గేట్ల ముట్టడి చేపట్టారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో పార్లమెంట్‌లో పలువురు ఎంపీలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం వెనక్కు తగ్గేది లేదని తేల్చి చెప్పింది. ఇందులో భాగంగా అమ్మకాల ప్రక్రియలకు ట్రాన్సాక్షన్, లీగల్ అడ్వైజర్ల నియామకాలు చేపట్టింది. ఉక్కు ఉద్యమానికి కార్మిక సంఘాలు, రచయితలు, మేధావులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాలు ఇలా అన్ని వర్గాలకు చెందిన వారు మద్దతు ఇస్తూ దీక్షల్లో పాల్గొంటున్నారు. దీక్షలు ప్రారంభించిన నాటి నుంచి ముఖ్యమైన ఘట్టాలను పరిశీలిస్తే.. 2021 ఫిబ్రవరి 3న వేలాది మంది కార్మికులు ఉక్కు పరిపాలన భవనాన్ని ముట్టడించారు.



స్టీల్‌ప్లాంట్ నుంచి జీవీఎంసీ వరకు బైక్ ర్యాలీ చేస్తున్న కార్మికులు(ఫైల్)

ఫిబ్రవరి 5న స్టీల్‌ప్లాంట్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ చేశారు. ఫిబ్రవరి 12న సీపీఐ కార్యదర్శి నారాయణ రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఫిబ్రవరి 17న నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ విమానాశ్రయంలో పోరాట కమిటీ నాయకులతో సమావేశమై తమ సంఘీభావం తెలిపారు. ఆ తర్వాత అన్ని రాజకీయ పార్టీలతో భారీ బహిరంగ సభ, జాతీయ రహదారి రాస్తారోకో, రెండు రోజులపాటు జాతీయ రహదారి దిగ్బంధం, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేత, చలో కలెక్టరేట్, 36 గంటల నిరాహార దీక్షలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన రైతు సంఘం నాయకుడు రాకేష్ తికాయిత్ విశాఖ వచ్చి ఉక్కు ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. ప్రముఖ సామాజిక వేత్త మేధా పాట్కర్ దీక్ష శిబిరానికి విచ్చేసి కేంద్ర ప్రభుత్వం వైఖరిని ఎండగట్టారు. అప్పటి నుంచి రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి.

నేడు మానవహారం : దీక్షలు ప్రారంభించి 1500 రోజులు పూర్తవుతున్న సందర్భంగా శనివారం సాయంత్రం దీక్ష శిబిరం వద్ద మానవహారం నిర్వహించనున్నట్టు పోరాట కమిటీ ప్రకటించింది. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, నిర్వాసితులకు న్యాయం చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించరాదన్న డిమాండ్లపై ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.

సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే చట్టాలు అవసరం

- హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దుర్గా ప్రసాదరావు
- ఏయూలో జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీలు ప్రారంభం



జస్టిస్ దుర్గాప్రసాదరావును సత్కరిస్తున్న వీసీ రాజశేఖర్, ఇతర ఆచార్యులు

విశాఖ విద్య: ఆధునిక సాంకేతికత విసిరే సవాళ్లకు సమాధానమిచ్చే పటిష్టమైన చట్టాలను రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు అభిప్రాయపడ్డారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ న్యాయ కళాశాలలో శుక్రవారం జాతీయస్థాయి మూట్ కోర్టు పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జస్టిస్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ సమాజ అవసరాలకు అనుగుణంగా చట్టాల్లో మార్పులు వస్తాయని తెలిపారు. శాస్త్రీయ ఆవిష్కరణలు సమాజానికి ఎంతో మేలు చేస్తున్నాయని, అదే సమయంలో కొన్ని సవాళ్లను సైతం ఎదురవుతున్నాయని ఉదాహరణలతో వివరించారు. న్యాయవాదులు, న్యాయ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మార్పులను నిశితంగా గమనించాల్సిన అవసరం ఉందన్నారు. గత నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా రూ.13 వేల కోట్ల విలువైన మత్తుపదార్థాలను పట్టుకున్నారని చెప్పారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం గురించి వివరించి.. సైబర్ నేరాలు, శిక్షలు ఏ విధంగా విధిస్తారనే అంశాలను తెలియజేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను విరివిరిగా వినియోగిస్తున్నారని.. దీనితో మేధో హక్కులకు భంగం కలిగే అవకాశం ఏర్పడుతోందన్నారు. యూరోపియన్ దేశాలు హక్కులను రక్షించడానికి కఠినమైన చట్టాలను రూపకల్పన చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. భారత్‌లో ఈ రంగానికి సంబంధించి ప్రత్యేకమైన చట్టాలు ప్రస్తుతం లేవని, దీనిపై మేధో చర్చలు జరగాలని సూచించారు. ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ మాట్లాడుతూ యువ న్యాయ విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. వివిధ కేసుల్లో వచ్చే తీర్పులపై సాధారణ ప్రజలకు సైతం అవగాహన కల్పించే సులభమైన విధానాలను రూపొందించాలని సూచించారు. న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం మాట్లాడుతూ న్యాయ విద్యార్థులకు అవసరమైన ప్రత్యక్ష శిక్షణ, నైపుణ్యాలను అందించే విధంగా ఈ పోటీలు ఉంటాయని చెప్పారు. ఈ పోటీలకు దేశవ్యాప్తంగా 24 విద్యాసంస్థల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి అతిథులు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గా ప్రసాద్‌రావును సత్కరించారు. ఆచార్య వై. సత్యనారాయణ, ఆచార్య వి. కేశవరావు, ఆచార్య ఎస్. సుమిత్ర, ఆచార్య వి. రాజ్యలక్ష్మి, ఆచార్య వి. విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

29న జీవీఎంసీ బడ్జెట్ ప్రత్యేక సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రత్యేక బడ్జెట్ సమావేశం ఈ నెల 29న నిర్వహించనున్నారు. వాస్తవానికి గత నెలలోనే బడ్జెట్ సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా నిర్వహించలేదు. జీవీఎంసీ 2025-26 ఏడాదికి సంబంధించి వార్షిక బడ్జెట్‌ను జీవీఎంసీ స్థాయీ సంఘం ఆమోద ముద్ర గత డిసెంబర్‌లోనే వేసింది. జీవీఎంసీ 2025-26 వార్షిక బడ్జెట్ ప్రారంభపు నిల్వ రూ.476.44 కోట్లు, అన్ని పద్దుల కింద జమలు రూ.4232.71 కోట్లు, ప్రారంభపు నిల్వతో కలిపి మొత్తం జమలు రూ.4709.15 కోట్లు, అన్ని పద్దుల కింద ఖర్చులు రూ.4,554.27 కోట్లు, ముగింపు నిల్వగా రూ.154.88 కోట్లుగా చూపారు.

మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్

విశాఖ లీగల్: కేసుల రాజీకి మధ్యవర్తిత్వ ప్రక్రియ ఉపయుక్తంగా నిలుస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్ అన్నారు. ఐదు రోజులుగా జిల్లా కోర్టు నూతన ప్రాంగణంలోని సమావేశ మందిరంలో జరుగుతున్న న్యాయవాదుల మధ్యవర్తిత్వ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. జిల్లాకు చెందిన న్యాయవాదులు, ప్రభుత్వ సిబ్బంది ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ ఇతర దేశాలతో పోలిస్తే భారత్ మధ్యవర్తిత్వ విషయంలో వెనుకబడి ఉందన్నారు. శిక్షితులైన న్యాయవాదులు కేసులను ప్రాథమిక స్థాయిలోనే పరిష్కరించే దిశగా తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి ఫలితాలను అందించాలన్నారు. మధ్యవర్తిత్వ జాతీయ శిక్షకురాలు ఎస్.అరుణాచలం మాట్లాడుతూ కేసుల సత్వర పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఓ వెలుగు రేఖగా చెప్పారు. ఈ పక్రియ ద్వారా కేసులు రాజీ చేసుకుంటే బహుళ ప్రయోజనాలు ఉంటాయన్నారు. మరో జాతీయ శిక్షకురాలు బీన దేవి మాట్లాడుతూ న్యాయవాదులందరూ మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి ఉంటే కేసుల రాజీ సులభతరమవుతుందన్నారు. న్యాయస్థానాలపై భారం తగ్గించడం ద్వారా పెండింగు కేసులు సత్వర విచారణకు ఈ ప్రక్రియ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో 40 మంది న్యాయవాదులు, సిబ్బంది, విశాఖ జిల్లా న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి ఎం.వి. శేషమ్మ పాల్గొన్నారు.

ఐఏఎస్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా శ్రీధర్



విశాఖ సిటీ: ఇండియన్ ఆర్థ్రోస్కోపీ సొసైటీ(ఐఏఎస్) గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్‌గా తొలిసారిగా తెలుగువారైన డాక్టర్ శ్రీధర్ గంగవరపు ఎన్నికయ్యారు. మెడికవర్ ఆస్పత్రిలో ఆర్థ్రోస్కోపీ కీ హోల్ స్పెషలిస్ట్ అయినా శ్రీధర్ 2025 నుంచి 2027 వరకు ఐఏఎస్ సభ్యుడిగా కొనసాగనున్నారు. ఐఏఎస్ ఎన్నికల్లో తొలిసారిగా తెలుగు వ్యక్తి గెలవడం రాష్ట్రానికి గర్వకారణమని మెడికవర్ ముఖ్య అధికారులు, వైద్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

మెట్లు కూలి మహిళా కూలీ మృతి

- ఇద్దరికి గాయాలు

పీఎంపాలెం: నిర్మాణంలో ఉన్న భవనం మెట్లు కూలిపోయిన ఘటనలో మహిళా కూలీ సంఘటన స్థలంలోనే దుర్మరణం పాలైంది. ఈ ఘటనలో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పీఎంపాలెం సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలివి. జీవీఎంసీ 8వ వార్డు పరిధి పనోరమ హిల్స్ వద్ద ఐకానికా గ్రాండ్ విల్లా నంబరు 121 నిర్మాణంలో ఉంది. ఈ భవనం మెట్ల నిర్మాణ లోపం కారణంగా రెండవ అంతస్తు నుంచి కూలిపోయి.. అదే భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో పని చేస్తున్న మహిళా కూలీ నీలరోతు రామలక్ష్మిపై పడ్డాయి. విజయనగరం జిల్లా మొరకముడిదాం మండలం వేముల గ్రామానికి ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇదే ఘటనలో విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం చౌడంతవలస గ్రామానికి చెందిన టి.ఆదినారాయణ వెన్నుపూస దెబ్బతింది. భీమిలి చేపలుప్పాడకు చెందిన కోడా అమ్మాజమ్మ కాలు విరిగి బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను గాయత్రి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ భాస్కర్ సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కాపర్ చోరీ కేసులో 8 మంది అరెస్ట్

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీలో పలు చోట్ల డ్రిల్లింగ్ చేసి కాపర్ దొంగతనానికి పాల్పడిన కేసులో 8 మందిని అరెస్ట్ చేసినట్లు ద్వారకా క్రైం సీఐ చక్రధరరావు తెలిపారు. ఈ వివరాలను శుక్రవారం ఎంవీపీ కాలనీ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నగరంలో ఎనిమిదేళ్ల కిందట జరిగిన బీఎస్ఎన్ఎల్ పనుల్లో పెందుర్తికి చెందిన ఆసనాల పిట్టోడు(ఏ1), ఏలూరుకు చెందిన బి.శ్రీను, జి.గోవర్ధన్, బి.ఏడుకొండలు, బి.రాజు, సీహెచ్ దుర్గాప్రసాద్, డి.రాజేష్, బి.ప్రసాద్ పాల్గొన్నారు. కాపర్ వైర్‌తో కూడిన పనులు చేపట్టారు. ప్రస్తుతం ల్యాండ్ లైన్ సేవలు నిలిచిపోవడంతో ఎవరూ పట్టించుకోరనే ఉద్దేశంతో కాపర్ వైర్ దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఎంవీపీకాలనీలో రాత్రి పూట అండర్ గ్రౌండ్ డ్రిల్లింగ్ చేసి.. 800 మీటర్ల కాపర్ వైరు చోరీ చేశారు. దీనిపై బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి చుట్టూరి మురళీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. ఈ కేసులో 8 మందిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. 300 కిలోల కాపర్ వైరుతో పాటు టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మంటలతో విశ్రాంత నేవీ ఉద్యోగి బెదిరింపులు

సీతమ్మధార: కుటుంబ కలహాల నేపథ్యంలో మతిస్థిమితం కోల్పోయిన విశ్రాంత నేవీ ఉద్యోగి.. ఇంట్లో మంట పెట్టి బెదిరించిన ఘటన కైలాసపురంలో చోటుచేసుకుంది. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపిన వివరాలివి. కైలాసపురంలో గౌరీ శంకర్ రెసిడెన్సీలోని ఐదవ అంతస్తులో నేవీ విశ్రాంత ఉద్యోగి సంతోష్ ఆర్కే నివాసముంటున్నాడు. భార్యతో కలహాల నేపథ్యంలో ఆమె పిల్లలను తీసుకుని కొద్ది రోజుల కిందట పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మనస్తాపంతో అతను పిచ్చిపిచ్చిగా ప్రవర్తించడం ప్రారంభించాడు. శుక్రవారం సాయంత్రం సంతోష్ ఇంటి మధ్యలో చిత్తు కాగితాలకు నిప్పు పెట్టి.. ఇంటి గేటుకు తాడు కట్టి ఎవరూ లోపలికి రాకూడదని, తన కుక్క పోయిందని పెద్దగా కేకలు వేశాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో లోపల ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు తీసుకొచ్చి వాటికి నిప్పు పెట్టి పేల్చేస్తానని సంతోష్ బెదిరింపులకు దిగాడు. దీంతో సీఐ లోపలికి ప్రవేశించి అతన్ని పట్టుకుని.. సిలిండర్లను అక్కడ నుంచి తరలించారు. అతన్ని స్టేషన్‌కు తీసుకెళ్లారు. న్యాయమూర్తి ముందు హాజరుపరిచి మానసిక వైద్యశాలకు పంపిస్తామని సీఐ తెలిపారు.

రిమాండ్ ఖైదీతో 'యూఎస్ ఎంబసీ' ములాఖత్



రిమాండ్‌లో ఉన్న యూఎస్ పౌరుడితో ములాఖత్‌లో ఆ దేశ ఎంబసీ ప్రతినిధులు శ్రీదేవి, క్రిస్టీ చార్లెస్

ఆరిలోవ: ఓ మహిళ ఆత్మహత్య కేసులో రిమాండ్‌లో ఉన్న యూఎస్ సిటిజన్ పిల్లా శ్రీధర్‌ను ములాఖత్‌లో భాగంగా యూఎస్ ఎంబసీ ప్రతినిధులు గురువారం కేంద్ర కారాగారంలో కలిశారు. అతని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, బెయిల్, ఇతర సహాయంపై చర్చించినట్లు జైలు అధికారులు శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. యూఎస్ పౌరసత్వం కలిగిన విశాఖ వాసి పిల్లా శ్రీధర్‌కు నగరంలో ఇటీవల జరిగిన ఓ మహిళ ఆత్మహత్య కేసులో కోర్టు రిమాండ్ విధించింది. విదేశీ పౌరసత్వం ఉండటంతో నిబంధనల మేరకు ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖకు సమాచారం అందించినట్లు జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్(డీఎస్) ఎన్.సాయిప్రవీణ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయనతో ములాఖత్‌కు యూఎస్ ఎంబసీ నుంచి అమెరికన్ సిటిజన్ సర్వీసెస్ స్పెషలిస్ట్ శ్రీదేవి పోలి, వైస్ కౌన్సిల్ క్రిస్టీ చార్లెస్ వచ్చినట్లు పేర్కొన్నారు. విదేశీయులు ఎవరు జైల్‌కు రిమాండ్‌కు వచ్చినా ఆ దేశ మంత్రిత్వ శాఖకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇటీవల శ్రీకాకుళానికి చెందిన ఇద్దరు యూఎస్ సిటిజన్లు బెయిల్‌పై విడుదలైనట్లు పేర్కొన్నారు. వీరిద్దరు ఓ స్థల వివాదంపై రిమాండ్‌కు వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్ర కారాగారంలో తొమ్మిదేళ్లుగా జైలు శిక్ష అనుభవిస్తున్న నైజీరియాకు చెందిన ఓ ముద్దాయితో పాటు, సైబర్ నేరంలో అరెస్టయిన తైవాన్‌కు చెందిన ఇద్దరు ఖైదీలు ఉన్నట్లు డీఎస్ సాయి ప్రవీణ్ తెలిపారు. వీళ్ల వారి దేశంలో తమ కుటుంబ సభ్యులతో ఇ-ములాఖత్‌లో భాగంగా వీడియోకాల్ ద్వారా మాట్లాడుతుంటారని వెల్లడించారు.

మాజీ సర్పంచ్ భూమిలో టీడీపీ నేతల దౌర్జన్యం

- జెర్రిపోతులపాలెంలో సరుగుడు, అరటి చెట్ల తొలగింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



వైఎస్సార్‌సీపీ నేతకు చెందిన భూమిలో అరటి చెట్లను తొలగించిన టీడీపీ నాయకులు

పెందుర్తి: పెందుర్తి నియోజకవర్గంలో అధికార కూటమి నాయకుల దౌర్జన్యాల పరంపర కొనసాగుతోంది. పెందుర్తి మండలం జెర్రిపోతుపాలెం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత కోన శ్రీనివాసరావుకు చెందిన డీ-ఫారం భూమిలోని సరుగుడు, అరటి తోటలను అదే గ్రామానికి చెందిన సర్పంచ్, టీడీపీ నేత మడక అప్పలరాజు, మరికొంత మంది నాయకులు ధ్వంసం చేశారు. అడ్డుకున్న శ్రీనివాసరావు, ఇతర గ్రామస్తులపై దాడికి పాల్పడినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వివరాలివీ.. జెర్రిపోతులపాలెం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత కోన శ్రీనివాసరావుకు గ్రామానికి సమీపంలోని పెదగాడి సర్వే నంబర్ 420/1లో పిత్రార్జితంగా వచ్చిన డీ-ఫారం భూమి ఉంది. అందులోని కొంత భాగంలో సరుగుడు, అరటి తోట వేశారు. మిగిలిన భూమిలో కాయగూరలు పండిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సర్పంచ్ మడక అప్పలరాజు, టీడీపీ నాయకుడు గళ్ల శ్రీనివాసరావు, వారి అనుచరులు శ్రీనివాసరావుకు చెందిన భూమిలోకి చొరబడి మొక్కలను ఇష్టానుసారం నరికేశారు. సమాచారం అందుకున్న కోన శ్రీనివాసరావు అక్కడికి వెళ్లి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం జరిగింది. టీడీపీ నాయకుల దౌర్జన్యంపై పోలీసులకు శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. తనకు టీడీపీ నాయకుల నుంచి ప్రాణహాని ఉందని అందులో పేర్కొన్నారు. ఈ వివాదంపై టీడీపీ నాయకులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు'కు వ్యతిరేకంగా నిరసన



ముస్లింలకు మద్దతు తెలుపుతున్న హిందూ, క్రిస్టియన్, సిక్కు ఆవాజ్ సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు'ను వ్యతిరేకిస్తూ విశాఖలో ముస్లింలు శాంతియుత నిరసన చేపట్టారు. యునైటెడ్ ముస్లిం ఫ్రంట్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. వీరికి పలు రాజకీయ పార్టీలు, హిందూ, క్రిస్టియన్, సిక్కు, ఆవాజ్, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం ప్రతినిధులు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి.. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం కార్పొరేటర్ డాక్టర్ గంగారావు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఒక్కో బిల్లును ప్రవేశపెడుతోందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో ఉన్న వక్ఫ్ బోర్డు భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి వక్ఫ్ బోర్డు బిల్లుకు సవరణలు చేపట్టిందని దుయ్యబట్టారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు భూములు పూర్తిగా ముస్లింలకు చెందిన ప్రైవేట్ భూములన్నారు. సిక్కు సంఘం నేత సచ్చేంద్ర సింగ్ మాట్లాడుతూ తక్షణం బిల్లును ఉపసంహరించుకోకపోతే దేశంలో లౌకికవాదం పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం నేత అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ దేశంలో ఎస్సీ, ఎస్టీల కంటే ముస్లింల పరిస్థితి దయనీయంగా ఉందని ప్రభుత్వ నివేదికలే స్పష్టం చేస్తున్నాయన్నారు. తక్షణం వక్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో యునైటెడ్ ముస్లిం ఫ్రంట్ ప్రెసిడెంట్ అబ్దుల్ మున్నన్, జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఇలియాస్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ అహ్మద్, స్టేట్ మైనారిటీ యూత్ లీడర్ మహమ్మద్ ఇమ్రాన్, మాజీ కార్పొరేటర్ గొల్లపల్లి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.